గదిలోంచి ఒకటి రెండు సార్లు భావయుతంగా దగ్గు వినబడింది. అయినా కమల కదల లేదు.

"కమలా" అని పిలచాడు.

ఆ బర్రె గొంతుక విని అత్తగారు, "అమ్మాయి, పిలుస్తున్నాడే" అని హెచ్చరించింది.

కమల ఇంకా కదలలేదు.

తల్లి నడవలో దీపం తగ్గించి, నుక్కు మంచం వేసుకోటం గమనించి, కమల మెల్లగా లేచింది.

"ఇందాకటినుంచి ఏమి చేస్తున్నావు?" అని, భర్త "ఇదిగో పూలింకా ఇలాగే ఉంచావేం... పెట్టుకో" అన్నాడు.

కమల కిటికీలో కూర్చొని నక్షత్రాల కేసి చూస్తోంది. చల్లని గాలికి ఆమెకు మళ్లీ ప్రాణం వస్తోంది. కిటికీ చువ్వలు నుదురుకు ఒత్తు కుంటున్నాయ్...

అతను పూల పొట్లం తీసి, కమల ఒళ్లో పెట్టాడు. తన బరువైన రెండు చేతులను ఆమె భుజాల మీద ఆన్చి, "ఏయే... అలా చూస్తున్నా వేమిటి" అన్నాడు.

ఆమె జవాబేమీ చెప్పలేదు.

అతను "ఇదిగో ఓ తమాషా తెచ్చా" అంటూ పెట్టెలోంచి ఏవో రెండు పుస్తకాలు తీసి, దీపం ఆమె దగ్గఱకు తెచ్చి పుస్తకాలు తెఱచాడు.

అతని ముఖం మళ్లీ సంతోషంతో చాటంత అయింది.

"పెట్టుకో మరి పూలు..."

............

"దబ్బున... పెట్టుకో..."

.........

"నేను వస్తానని వ్రాసినా తలంటిపోసుకో లేదేం? పోనీలే...దబ్బున పూలు పెట్టుకో" అని పెట్టెలోంచి అగరు పుల్లలు, ఏదో సెంటు బుడ్డి తీశాడు.

అతను దీపం తగ్గించాడు. కమల ఆకాశంలోకి చూసింది. విశ్వమంతా వెన్నెల వరదై ప్రవహిస్తోంది. లేచి కిటికీ తలుపులు వేసింది. తగ్గించిన దీపం వెల్తురులో భర్త నీడ భయంకరంగా కన్పించింది.

"ఇదిగో పుస్తకాలు చూడు...బొమ్మలు"

"............"

"ఇదిగో... ఈ సెంటురాసుకో..."

"............"

"ఇంకా పూలు పెట్టుకో లేదూ ?"

"............"

"నా ఉత్తరాలకు జవాబే వ్రాయలేదేం ?"

"............"

"మరి...పూలు..."

ఇంతవరకూ మూగగానే ఉన్న కమల లేచి, "అలా ఉండనీయండి పూలు..." అని, దీపం ఇంచుమించు పొంతం తగ్గించింది.

